వరల్డ్‌కప్ 2023

సెమీఫైనల్ -2
దక్షిణాఫ్రికా X ఆస్ట్రేలియా
మ. 2.00 నుంచి
వేదిక: కోల్‌కతా

షమీ ఫైనల్

ఫైనల్లో రోహిత్ సేన

సచిన్ రికార్డు బద్దలు

70 పరుగులతో న్యూజిలాండ్ చిత్తు

శ్రేయస్ అద్భుత శతకం

విరాట్ 50వ వన్డే సెంచరీ

షమీ (7/57)

శ్రేయస్ (105)

షమీకి 7 వికెట్లు

డారిల్ పోరాటం వృథా

భారత్ సాధించింది..
గత రెండుసార్లు ప్రపంచకప్ సెమీఫైనల్లో తడబడ్డ టీమ్‌ఇండియా..
ఈ సారి ఆ అడ్డంకిని దాటుకొని ఫైనల్లో అడుగుపెట్టింది.
140 కోట్ల మంది ఆశీర్వచనాలతో స్వదేశంలో అజేయంగా సాగుతున్న రోహిత్‌సేన..
వరల్డ్‌కప్ సెమీఫైనల్లో న్యూజిలాండ్‌ను మట్టికరిపించి..
2019 సెమీస్‌లో ఎదురైన పరాభవానికి బదులు తీర్చుకుంది.
వాంఖడే స్టేడియంలో ఒకవైపు మెరైన్ డ్రైవ్ మరోవైపు అభిమానుల నీలి సముద్రం సాక్షిగా కివీస్ భరతం పడుతూ భారత్ దుమ్మురేపింది!

క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ రికార్డును బద్దలు కొడుతూ.. విరాట్ కోహ్లీ 50వ వన్డే సెంచరీతో అదర గొడితే.. శ్రేయస్ అయ్యర్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ శతకంతో కదంతొక్కాడు. రోహిత్ శర్మ తనకు అలవాటైన రీతిలో జట్టుకు మెరుపు ఆరంభాన్నిస్తే.. శుభ్‌మన్ గిల్ కండ రాలు పట్టేసినా సడలని పట్టుదలతో హాఫ్ సెంచరీతో ఆకట్టుకు న్నాడు. ఇక చివర్లో కేఎల్ రాహుల్ ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు.

ఫలితంగా వరల్డ్‌కప్ నాకౌట్‌లోనే అత్యధిక స్కోరు నమోదు చేసిన భారత్.. అభిమానులను ఆనంద డోలికల్లో ముంచెత్తింది.

ఇంకేముంది భారత్ విజయం నల్లేరు మీద నడకే అనుకుంటే.. న్యూజిలాండ్ పట్టు వీడలేదు. 220/2తో ఒక దశలో తీవ్ర ప్రతిఘటన కనబర్చింది. డారిల్ మిషెల్ భారీ సెంచరీకి కేన్ విలియమ్సన్, గ్లెన్ ఫిలిప్స్ దంచుడు తోడవడంతో.. భారత శిబిరంలో ఆందోళన నెలకొనగా.. సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ నేను న్నానంటూ బాధ్యతను భుజానెత్తుకున్నాడు. టీమ్‌కు అవసరమైన ప్రతీసారి వికెట్ పడగొట్టి.. ఏడుగురు బ్యాటర్లను పెవిలియన్ బాట పట్టించి జట్టుకు అపురూ పమైన విజయాన్ని అందించాడు.

పుష్కర కాలం తర్వాత స్వదేశంలో జరుగుతున్న వన్డే ప్రపంచకప్‌లో ఆడిన పది మ్యాచ్‌ల్లోనూ విజయాలు సాధించిన టీమ్‌ఇండియా.. ఇక ఆదివారం అహ్మదాబాద్‌లో జరుగనున్న ఫైనల్లో రెండో సెమీస్ విజేతతో అమీతుమీ తేల్చుకోనుంది!

ముంబై: టీమ్‌ఇండియా రికార్డు స్థాయిలో వరుసగా పదో విజ యంతో వరల్డ్‌కప్ ఫైనల్లో అడుగు పెట్టింది. బుధవారం జరిగిన తొలి సెమీఫైనల్లో భారత్ 70 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌ను చిత్తు చేసి నాలుగోసారి ప్రపంచకప్ తుదిపోరుకు అర్హత సాధించింది. 2015, 2019లో సెమీఫైనల్లో పరాజయాలు ఎదుర్కొన్న రోహిత్ సేన.. ఈ సారి ఏమాత్రం అవ కాశం ఇవ్వకుండా విశ్వ రూపం కనబర్చింది. పూర్తి సన్నద్ధతతో మెగాటో ర్నీలో అడుగుపెట్టిన టీమ్‌ఇం డియా.. సెమీస్ లోనూ అదే జోరు కొనసాగించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్.. నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 397 పరుగులు చేసింది. కింగ్ కోహ్లీ (113 బంతుల్లో 117; 9 ఫోర్లు, 2 సిక్సర్లు) వన్డేల్లో 50వ సెంచరీ నమోదు చేసుకుంటే.. శ్రేయస్ అయ్యర్ (70 బంతుల్లో 105; 4 ఫోర్లు, 8 సిక్సర్లు) మెరుపు శతకంతో ఆకట్టుకున్నాడు. హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ (29 బంతుల్లో 47; 4 ఫోర్లు, 4 సిక్సర్లు) మరోసారి జట్టుకు అద్భు తమైన ఆరంభాన్నివ్వగా.. మరో ఓపెనర్ శుభ్ మన్ గిల్ (66 బంతుల్లో 80 నాటౌట్; 8 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధసెంచరీతో ఆకట్టుకు న్నాడు. చివర్లో కేఎల్ రాహుల్ (20 బంతుల్లో 39 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్సర్లు) విలువైన పరుగులు జోడించాడు. ఫలితంగా భారత్ నాకౌట్‌లో సంపూర్ణ ఆధిపత్యం కనబ ర్చుతూ.. కొండంత స్కోరు చేసింది. న్యూజి లాండ్ బౌలర్లలో టిమ్ సౌథీ 3 వికెట్లు పడగొ ట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో న్యూజి లాండ్ 48.5 ఓవర్లలో 327 పరుగు లకు ఆలౌటైంది. డారిల్ మిషెల్ (119 బంతుల్లో 134; 9 ఫోర్లు, 7 సిక్సర్లు) భారీ సెంచరీతో ఆకట్టుకోగా.. కెప్టెన్ కేన్ విలియ మ్సన్ (69; 8 ఫోర్లు, ఒక సిక్సర్), గ్లెన్ ఫిలిప్స్ (41; 4 ఫోర్లు, 2 సిక్సర్లు) పోరా డారు. భారత బౌలర్లలో షమీ 7 వికెట్లతో చరిత్ర సృష్టించగా.. బుమ్రా, సిరాజ్, కుల్దీప్ తలా ఒక వికెట్ పడగొట్టారు. ఆస్ట్రేలియాతో లీగ్ మ్యాచ్‌లో భారీ లక్ష్యాన్ని దాదాపు ఛేదిం చినంత పనిచేసిన న్యూజిలాండ్.. ఈ సారి కూడా భయపెట్టింది. ఒక దశలో కివీస్‌కు చేజింగ్ పెద్ద కష్టం కాదు అనిపించినా.. షమీ తన అద్వితీయ బౌలింగ్‌తో న్యూజిలాండ్‌ను ఇంటి బాట పట్టించాడు. షమీకి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. గురువారం రెండో సెమీఫైనల్లో దక్షిణాఫ్రికాతో ఆస్ట్రేలి యాతో తలపడనుంది. ఈ మ్యాచ్ విజేతతో ఆదివారం అహ్మదాబాద్‌లో టీమ్‌ఇండియా అమీతుమీ తేల్చుకోనుంది.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 397/4 (కోహ్లీ 117, శ్రేయస్ 105; సౌథీ 3/100), **న్యూజిలాండ్:** 48.5 ఓవర్లలో 327 ఆలౌట్ (డారిల్ 134, విలియమ్సన్ 69; షమీ 7/57).

గురువును మించిన శిష్యుడు

అండర్-19 ప్రపంచకప్‌లో రాణించి.. తొలిసారి భారత జట్టుకు ఎంపికైన విరాట్ కోహ్లీని డ్రెస్సింగ్ రూమ్‌లో అప్పటి సీనియర్లు ర్యాగింగ్ చేశారు. టీమ్‌లోకి కొత్తగా ఎవరు వచ్చినా.. ముందట సచిన్ టెండూ ల్కర్ కాళ్లు మొక్కాలని.. అది డ్రెస్సింగ్ రూమ్ నియమమని ఆట పట్టించారు. నిజమే అనుకున్న కోహ్లీ మారు మాట్లాడకుండా మాస్టర్ కాళ్ల మీద పడ్డాడు. ఇదంతా ముందే తెలి సినా.. సహచరుల చిలిపి చేష్టలకు ముసిముసి నవ్వులు నవ్వుకున్న సచిన్ టెండూల్కర్.. ఇన్నేండ్ల తర్వాత ఆ సందర్భాన్ని గుర్తు చేసుకు న్నాడు. వన్డే క్రికెట్‌లో అత్యధిక సెంచ రీల రికార్డును బ్రేక్ చేసిన కోహ్లీపై ఎక్స్ వేదికగా.. సచిన్ ప్రశంసలు కురి పించాడు. 'తొలిసారి నిన్ను (కోహ్లీ) భారత డ్రెస్సింగ్ రూమ్‌లో కలిసిన ప్పుడు.. సహచరుల ప్రోద్బలంతో నా పాదాలను తాకావు. ఆ సమ యంలో నవ్వు ఆపుకోలేకపోయా. కానీ అనతి కాలంలోనే అటపట్ల నీకున్న అంకితభావం.. నైపుణ్యంతో నువ్వు నా మనసును తాకావు. నాకు చాలా ఆనందంగా ఉంది. ఓ చిన్న కుర్రాడు.. ఇప్పుడు ఇలా 'విరాట్' ప్లేయర్‌గా ఎదగడం సంతోషాన్ని స్తుంది. నా రికార్డులు భారతీయుడు బద్దలు కొట్టడం కంటే గొప్ప విషయం ఇంకేముంటుంది. అదీ ప్రపంచకప సెమీఫైనల్ లాంటి పెద్ద మ్యాచ్‌లో.. నా సొంత మైదానంలో కావడం మరింత ప్రత్యేకం' అని సచిన్ ఎక్స్‌లో రాసుకొచ్చాడు. ఇక ఆ అద్భుత ఇన్నింగ్స్ తర్వాత మైదా నంలో ఉన్న సచిన్ వైపు వినయపూ ర్వకంగా చూస్తూ సంజ్ఞలు చేసిన కోహ్లీ..తన హీరోకు ప్రత్యేక అభివాదం చేశాడు.

కోహ్లీ (117)

కోహ్లీ సెంచరీలు.. ఏ దేశంపై ఎన్ని..

శ్రీలంకపై	10
వెస్టిండీస్‌పై	9
ఆస్ట్రేలియాపై	8
న్యూజిలాండ్‌పై	6
బంగ్లాదేశ్‌పై	5
దక్షిణాఫ్రికాపై	5
ఇంగ్లండ్‌పై	3
పాకిస్థాన్‌పై	3
జింబాబ్వేపై	1

టీమ్‌ఇండియా అద్భుత విజయం

50
వన్డేల్లో విరాట్ సెంచరీల సంఖ్య. సచిన్ టెండూల్కర్ (49)ను దాటేసి అగ్రస్థానానికి చేరాడు. రోహిత్ (31) మూడో స్థానంలో ఉన్నాడు.

1
ఒకే ప్రపంచకప్‌లో అత్యధిక (27) సిక్సర్లు కొట్టిన జాబితాలో రోహిత్ శర్మ అగ్రస్థానంలో నిలిచాడు. గేల్ (26; 2015) రెండో స్థానంలో ఉన్నాడు.

ఒక ప్రపంచకప్ ఎడిషన్‌లో అత్యధిక పరుగులు (711) చేసిన ప్లేయ ర్‌గా విరాట్ కోహ్లీ నిలిచాడు. సచిన్ (674; 2003లో) రెండో స్థానంలో ఉన్నాడు.

"వెల్‌డన్ విరాట్‌కోహ్లీ. వన్డేల్లో సెంచరీల హాఫ్ సెంచరీ చేశావు. ప్రపంచకప్ సెమీఫైనల్లో ఇలాంటి అరుదైన ఘనత సాధించడం అద్భుతం. నీ ప్రతి భకు వందనం విరాట్ - మంత్రి కేటీఆర్

టీమ్‌ఇండియాకు అభినందనలు. వాట్ ఏ షమీ ఫైనల్! అద్భుత ప్రదర్శనతో షమీ మ్యాచ్‌లో హైలెట్‌గా నిలిచాడు. వన్డేల్లో 50 సెంచరీలు చేసిన తొలి బ్యాటర్‌గా నిలిచిన విరాట్ కోహ్లీకి వందనం. ప్రపంచకప్‌లో టీమ్‌ఇండియా అద్భుత ప్రదర్శన కనబరిచింది - మంత్రి హరీశ్‌రావు

ముంబై నడిగడ్డపై అద్భుతం ఆవిష్కృతమైంది. కోహ్లీ కేవలం బౌండరీలే కాదు రికార్డులు కొల్లగొడుతున్నాడు. ప్రపంచకప్ సెమీఫైనల్లో అద్భుత ఫీట్ ద్వారా భారత క్రికెట్ అభిమా నులనే కాదు ప్రపంచవ్యాప్తంగా ఫ్యాన్స్‌ను అలరించాడు. కోహ్లీని చూసి అందరం గర్విస్తున్నాం - ఎమ్మెల్సీ కవిత

3
వన్డేల్లో అత్యధిక (13794) పరుగులు చేసిన జాబితాలో కోహ్లీ మూడో స్థానానికి చేరాడు. సచిన్ 18,426 పరుగులతో అగ్రస్థానంలో ఉండగా.. కుమార సంగక్కర (14,234) రెండో ప్లేస్‌లో కొనసాగుతున్నాడు.

7/57
ఈ మ్యాచ్‌లో షమీ గణాంకాలు. వరల్డ్‌కప్‌లో భారత్‌కు ఇదే అత్యుత్తమం.

2011 తర్వాత భారత్ తొలిసారి ఫైనల్ చేరింది. 2015, 19లో సెమీస్‌లో ఓటమి పాలైంది. ఓవరాల్‌గా టీమ్‌ఇండియా వరల్డ్‌కప్ ఫైనల్ చేరడం ఇది నాలుగోసారి.

397/4
వన్డే ప్రపంచకప్ నాకౌట్ మ్యాచ్‌ల్లో ఇదే అత్యధిక స్కోరు. 2015 మెగాటోర్నీ క్వార్టర్ ఫైనల్లో వెస్టిండీస్‌పై న్యూజిలాండ్ చేసిన 393/6 రెండో స్థానానికి చేరింది.

19
ఈ మ్యాచ్‌లో భారత ఆటగాళ్లు కొట్టిన సిక్సర్లు. వరల్డ్‌కప్ నాకౌట్ మ్యాచ్‌ల్లో ఇదే అత్యధికం.

8
వన్డే ప్రపంచకప్‌లో 50+స్కోరు చేయడం కోహ్లీకి ఇది ఎనిమిదోసారి. మెగాటోర్నీలో ఇదే అత్యధికం. సచిన్, షకీబ్ (7) రెండో స్థానంలో ఉన్నారు.



షమీ శత్రు వినాశనం

వరల్డ్‌కప్ సెమీఫైనల్ మ్యాచ్‌లో ఓ ఆటగాడు తన కెరీర్‌లో 50వ వన్డే సెంచరీ పూర్తి చేసు కొని క్రికెట్ దేవుడు, మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ రికార్డు బద్దలు కొట్టినా.. అతడికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కలేదు! వరుసగా రెండో మ్యాచ్‌లో సెంచరీ.. అందు లోనూ వేగవంతమైన శతకం.. నాలుగో స్థానంలో రికార్డు స్థాయి పరుగులు.. ఇలా ఎన్నో ఘనతలు సాధించిన మరో ప్లేయర్‌కు కూడా ఆ అవార్డు దక్కలేదు!! సాధారణంగా భారీ స్కోర్ల మ్యాచ్‌లో అందుకు పాటుపడిన ఆటగాడికి ఆ అవార్డు దక్కడం పరిపాటే.. కానీ, వాంఖడే పోరులో మాత్రం నిర్వాహ కులు అందుకు భిన్నమైన నిర్ణయం తీసుకు న్నారు. ఓ బౌలర్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు ప్రకటించారు. అంటే అతడేదో ప్రత్యేకమైంది సాధించాడని కొత్తగా చెప్పా ల్సిన పనిలేదుగా!

ఎప్పుడొచ్చాం అన్నది కాదన్నయ్యా..
బుల్లెట్టు దిగిందా లేదా..
ప్రత్యర్థి ఎవరన్నది కాదు..
వికెట్ నేలకూలిందా లేదా!
టాపార్డరా, టెయిలెండరా జాన్తానై..
బాల్ వేస్తే డగౌట్ బాట పట్టాల్సిందే!
కొత్త బంతా.. పాత బంతా అనేది అనవ సరం.. అతడి చేతికి వస్తే స్వింగ్ అవ్వాల్సిందే!

ఈ ప్రపంచకప్‌లో ఆలస్యంగా తుది జట్టులో చోటు దక్కించుకున్న మహమ్మద్ షమీ.. మరోసారి తన విలువ చాటుకున్నాడు. లీగ్ దశలో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లోనే ఐదు వికెట్లతో సత్తాచాటిన ఈ ఉత్తరప్రదేశ్ పేసర్.. ఈ సారి అంతకుమించి ప్రదర్శనతో రెచ్చిపోయాడు. అసలు బంతిని ఆడాలా వద్దా అనే సంశయంలో పడేస్తూ.. కివీస్ బ్యాటర్లను క్రీజులోనే చెడుగుడాడుకున్నాడు. తన తొలి బంతికే కాన్వే (13)ను ఔట్ చేసిన షమీ.. తదుపరి ఓవర్‌లో రచిన్ రవీంద్ర (13)ను వెనక్కి పంపాడు. నాలుగు ఓవర్ల తొలి స్పెల్‌లో కివీస్‌కు చుక్కలు చూపిన లాలా.. ఆ తర్వాత కేన్ విలియమ్సన్, డారిల్ మిషెల్ భాగస్వామ్యాన్ని విడదీసి మరోసారి జట్టును పోటీలోకి తెచ్చాడు. లాథమ్ (0)ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్న షమీ.. డారిల్ మిషెల్‌ను ఔట్ చేసి ఐదు వికెట్లు పూర్తి చేసుకున్నాడు. కివీస్ టాప్-5 బ్యాటర్లందరూ షమీకే వికెట్ సమర్పించుకోవడం గమ నార్హం.. చివర్లో మరో రెండు వికెట్లు తీసిన లాలా.. ఈ వరల్డ్‌కప్‌లో అత్యుత్తమ గణాంకా లతో పాటు.. మెగాటోర్నీల్లో భారత్ తరపున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు.

-నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

1 వరల్డ్‌కప్‌లో అత్యంత వేగంగా 50 వికెట్లు (17 ఇన్నింగ్స్‌ల్లో) తీసిన బౌలర్‌గా షమీ రికార్డు ల్లోకెక్కాడు.

ఒక ప్రపంచకప్‌లో అత్యధిక వికెట్లు (23) తీసిన భారత బౌలర్‌గా షమీ నిలిచాడు.

4 వరల్డ్‌కప్ ఫైనల్ చేరడం భార త్‌కు ఇది నాలుగోసారి. 1983, 2003, 2011లో తుదిపోరుకు అర్హత సాధిం చింది. అందులో రెండుసార్లు (1983, 2011లో) విశ్వ విజేతగా నిలిచింది.

ధోనీ రనౌట్‌కు.. సూపర్ కౌంటర్

2019 వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్లో లక్ష్యఛేదన చివర్లో మిస్టర్ కూల్ ధోనీ రనౌట్ రూపంలో వెనుదిరుగుతున్న సమ యంలో డ్రెస్సింగ్ రూమ్‌లో నిస్సహాయంగా కూర్చున్న రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ కళ్ల నిండా నీళ్లతో నిరాశగా కని పించారు! ఆ దృశ్యాలను మనసులో ముద్రించుకున్న ఈ ఇద్దరూ ఈ సారి ఎలాగైనా వదలకూడదనే లక్ష్యంతో మైదా నంలో తమ కసి కనబర్చారు. మ్యాచ్‌లో కోహ్లీ, శ్రేయస్ సెంచరీలు చేసినా.. అసలు జట్టుకు అవసరమైన పునాది వేసింది మాత్రం ముమ్మాటికీ రోహితే! లెఫ్టార్మ్ పేసర్ల బౌలిం గ్‌లో మనవాళ్లు తడబడతారు.. నాకౌట్ మ్యాచ్‌ల్లో టాపా ర్డర్ తుస్సుమంటుంది.. అనే శుష్క వాదనలను పక్కకు నెడుతూ.. దీపావళి ముగిసిన తర్వాత కూడా పటాకుల మోత తగ్గనివ్వకుండా రోహిత్ రెచ్చిపోయాడు. వాంఖడేలో వందల కొద్ది మ్యాచ్‌లు ఆడిన అనుభవం ఉన్న హిట్‌మ్యాన్.. కివీస్ బౌలర్లను ఆటాడుకున్నాడు. బంతి కాస్త గతితప్పితే చాలు దానిపై ఆకలిగొన్న సింహంలా విరుచుకుపడుతూ.. స్టాండ్స్‌లోకి తరలించాడు. రోహిత్ శుభారంభం అందిం చాక.. ఇక అక్కడి నుంచి భారత్ వెనుదిరిగి చూసుకోలేదు. మొదట్లోనే న్యూజిలాండ్ బౌలింగ్ దాడిని కకావికలం చేసే యడంతో.. కివీలు లయ అందుకునేందుకు ఇబ్బందిపడగా.. మిడిల్ ఓవర్స్‌లో కోహ్లీ తన అనుభవాన్ని చాటాడు. స్పిన్నర్లు మెరుగ్గా బౌలింగ్ వేస్తున్న సమయంలో వెనక్కి తగ్గిన కోహ్లీ.. ఒక్కసారి కుదురుకున్నాక స్పిన్, పేస్ అనే తేడా లేకుండా చెల రేగిపోయాడు. కండరాలు పట్టేయడంతో గిల్ మైదానాన్ని వీడగా.. శ్రేయస్ భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు.

వేదాంశ్‌కు టీటీ టైటిల్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ అంతర జిల్లాల టేబుల్ టెన్నిస్ చాంపియన్ షిప్‌లో వేదాంశ్ టైటిల్‌తో మెరిశాడు. బుధ వారం జరిగిన బాలుర అండర్-11 ఫైనల్లో వేదాంశ్ 11-9, 11-9, 13-11 తేడాతో శ్రీనీర్‌రెడ్డిపై అద్భుత విజయం సాధించాడు. మరోవైపు మహమ్మద్ అలీ 11-6, 11-6, 11-7తో రాజును ఓడించి టైటిల్ దక్కించు కున్నాడు. మహిళల పోరులో శ్రేష్టారెడ్డి 11-6, 11-9, 11-9తో పాలక్‌పై గెలిచి క్వార్ట ర్స్‌లోకి ప్రవేశించింది.

కెప్టెన్సీకి బాబర్ గుడ్‌బై

కరాచి : అన్ని ఫార్మాట్లలో పాకి స్తాన్ క్రికెట్ జట్టు నాయకత్వా నికి బాబర్ అజామ్ గుడ్‌బై చెప్పాడు. ఈ మేరకు అతడు నిర్ణయాన్ని సామాజిక మాధ్యమం ద్వారా తెలియజే శాడు. మూడు ఫార్మాట్లలో ఆటగాడిగా కొనసాగుతానని, కొత్త కెప్టెన్‌కు తన పూర్తి సహకారాన్ని అంద జేస్తానని అజామ్ తన ఎక్స్(ట్విటర్) ఖాతాలో పేర్కొన్నాడు. ప్రపంచకప్‌లో పాకి స్తాన్ నిరాశాజనక ప్రదర్శనతో విమర్శలు చెల రేగడంలో అజామ్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాక్ క్రికెట్ బోర్డు షహీన్ షా అఫ్రిదిని టి20 కెప్టెన్‌గా, షాన్ మసూద్‌ను టెస్టు కెప్టెన్‌గా నియ మించింది. డిసెంబర్‌లో ఆసీ స్‌తో మూడు టెస్టుల సిరీస్‌తో మసూద్ నాయకత్వం ప్రారంభం కానుండగా, జనవ రిలో న్యూజిలాండ్‌తో అయిదు మ్యాచ్‌ల సిరీ స్‌తో అఫ్రిది తొలిసారి జట్టు పగ్గాలు చేపట్టను న్నాడు. సమీప భవిష్యత్తులో పాక్ జట్టుకు వన్డే మ్యాచ్‌లేమీ లేకపోవడంతో ఆ ఫార్మా ట్‌కు కెప్టెన్‌ను ప్రకటించలేదు.

ప్రణయ్ ముందంజ

కుమమోటో : జపాన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత ఆటగాడు, ఏడో సీడ్ హెచ్.ఎస్.ప్రణయ్ ముందంజ వేశాడు. బుధవారం హాంకాంగ్ ఆటగాడు లీ చౌక్ యుతో జరిగిన పోరులో ప్రణయ్ మూడు గేమ్‌ల పోరులో 22-20, 19-21, 21-17తో విజయం సాధించాడు. కాగా ఇతర మ్యాచ్‌లలో లక్ష్య సేన్, ప్రియాంశు రజవత్ ఓటమిపాల య్యారు. గాయంనుంచి కోలుకుని పాల్గొన్న తొలి టోర్నీ తొలి మ్యాచ్‌లో ప్రణయ్ సత్తాచాటాడు. హోరాహోరీగా సాగిన మూడు గేమ్‌లలో ఇరు వురూ నువ్వానేనా అన్నట్టు తలపడ్డారు. తొలి గేమ్ టైబ్రేక్‌కు దారితీ యగా, రెండో గేమ్‌ను రెండు పాయింట్ల తేడాతో ప్రణయ్ కోల్పో యాడు. ఇక మూడో గేమ్ ఆరంభంలో ఆధిక్యం పలుమార్లు చేతులు మారినా, మ్యాచ్ కొనసాగేకొద్దీ ప్రణయ్ ఆటపై పట్టు సాధించి గేమ్‌తో పాటు మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు. మరో మ్యాచ్‌లో యువ ఆట గాడు లక్ష్య సేన్ వరుస గేమ్‌లలో జపాన్‌కు చెందిన కొడై నరవోక చేతిలో 17-21, 10-21తో ఓడిపోయాడు.

భువనేశ్వర్‌లో ఫుట్‌బాల్ అకాడమీ

న్యూఢిల్లీ : ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేష న్(ఏఐఎఫ్ఎఫ్), ఫిఫా ఆధ్వర్యంలోభువనే శ్వర్‌లో నెలకొల్పిన ఫుట్‌బాల్ అకాడమీని ఈనెల 21న ప్రఖ్యాత ఫుట్‌బాల్ కోచ్ ఆర్సెనె వెంగర్ ప్రారంభించనున్నాడు. ఫిఫా గ్లోబల్ ఫుట్‌బాల్ అభివృద్ధి కార్యక్రమం చీఫ్ అయిన వెంగర్ ప్రస్తుతం భారత్ పర్య టనలో ఉన్నాడు. అందులో భాగంగా వెంగర్ ఇండియన్ సూపర్ లీగ్(ఐఎస్ ఎల్), ఐ-లీగ్ క్లబ్‌లతోపాటు భారత ఫుట్ బాల్ అభివృద్ధికి కృషి చేస్తున్న సంస్థలతో భేటీ కానున్నాడు.

నేడు కువైట్‌తో భారత్ ఢీ

ఫుట్‌బాల్ ప్రపంచకప్ ఆసియా క్వాలిఫయర్

కువైట్ : ప్రపంచకప్ క్వాలిఫయర్స్ ఫుట్‌బాల్ పోటీలలో భాగంగా భారత జట్టు గురువారం స్థానిక జేబర్ అల్-అహ్మద్ స్టేడియంలో కువై ట్‌తో తలపడనున్నది. (గ్రూపు-ఎలో ఖతార్, కువైట్, అఫ్గానిస్థాన్ కూడా పోటీపడుతు న్నాయి. ఆసియానుంచి ఫిఫా క్వాలిఫయ ర్స్‌లో భారత జట్టు ఇప్పటివరకు మూడో రౌండ్ పోటీలకు అర్హత సాధించలేదు. గ్రూపులో తొలి రెండు స్థానాలలో నిలిచిన జట్లు మూడో రౌండ్‌కు అర్హత సాధిస్తాయి. ఆసియా చాంపియన్ ఖతార్ తరువాత ఈ గ్రూపులో తదుపరి రౌండ్‌కు భారత్‌కే అవకా శాలు ఎక్కువ. ఫిఫా ర్యాంకింగ్స్‌లో భారత్ 102 స్థానంలో ఉండగా, కువైట్ 136వ స్థానంలో కొనసాగుతున్నది. ర్యాంకింగ్‌లో తక్కువగా ఉన్నప్పటికీ కువైట్ శాఫ్ చాంపియ న్‌షిప్‌లో భారత్‌తో తలపడిన రెండుసార్లు మ్యాచ్‌లను డ్రాగా ముగించింది. గురువారం నాటి మ్యాచ్‌పైనే భారత జట్టు భవితవ్యం ఆధారపడి ఉంది. గత అయిదు అంతర్జా తీయ మ్యాచ్‌లలో భారత జట్టు రెండు పరా జయాలు, మూడు డ్రాలను సాధించగా, కువైట్ జట్టు రెండు విజయాలు, రెండు పరా జయాలు, ఒక డ్రాతో మెరుగ్గా ఉంది. దీనికి తోడు సొంతగడ్డపై ఆడుతుండడం కువైట్‌కు అనుకూలించే అంశం. అయినా ఈ మ్యాచ్‌లో గెలిచేందుకు సర్వశక్తులు ఒడ్డేందుకు సిద్ధమేనని భారత కెప్టెన్ సునీల్ ఛెత్రి విశ్వాసం వ్యక్తంచే శాడు. మ్యాచ్ భారత కాలమానం ప్రకారం రాత్రి 10 గంటలకు ప్రారంభమౌతుంది.

జొకోపై సిన్నర్ గెలుపు

ట్యురిన్ : ఇటలీకి చెందిన జానిక్ సిన్నర్ ఏటీపీ ఫైనల్స్ టెన్నిస్ టోర్నీలో సంచలన విజయం నమోదు చేశాడు. సిన్నర్ టాప్ ర్యాంకర్ నొవాక్ జొకోవిచ్‌ను మూడు సెట్ల పోరులో 7-5, 6-7(5), 7-6(2)తో ఓడించాడు. నాలుగుసార్లు ముఖాముఖి పోరులో 22 ఏళ్ల సిన్నర్‌కు జొకోపై ఇదే తొలి విజయం. మూడు గంటలకుపైగా సాగిన పోరులో మూడు సెట్లు టైబ్రేక్‌వరకు కొనసా గడం గమనార్హం. సిన్నర్ తదుపరి రౌండ్‌లో హోల్గర్ రూనెతో తలపడతాడు. కాగా 2019 చాంపియన్ త్సిసిపాస్ వెన్ను నొప్పి కారణంగా టోర్నీనుంచి తప్పుకున్నాడు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.